గల్పిక

# పిచ్చివాడి పెళ్లి

పన్యాల

పిచ్చివాడికి పెళ్ళి కుదిరింది.

పెళ్ళి కుదిరితేనేగాని పిచ్చి కుదరదన్నారు కొందరు. పిచ్చి కుదిరితేనేగాని పెళ్ళి కుదరదన్నారు కొందరు.

ఎందరేమన్నా, పిచ్చివాడికి పెళ్ళి కుదిరింది.

తనకు పెళ్ళి కుదిరిందన్న మాట పిచ్చివాడి తలకు పట్టించేసరికి, ప్రాణం తోకలోకి దిగింది. ప్రాణంతోపాటు పిచ్చికూడా ఉండల్లే పాకి, తోకలో మఠం వేసుకుంది.

శాస్త్రం ఊరికే పోదన్నారు పెద్దలు. పూర్వీకులు ఇటువంటి సత్యాలు ఆలోచించే శాస్త్రాలు చెప్పారన్నారు మరీ పెద్దలు.

పిచ్చి కుదిరినవాణ్ణి పీటలమీద కూర్చోపెట్టారు పెళ్ళి పెద్దలు. పెళ్ళి సంగతి చెపితే పిచ్చి కుదురుతుందని పూర్తిగా నమ్మి, పెళ్ళి కొప్పుకున్న కూతురు, పిచ్చి కుదిరినవాణ్ణి భర్తగా స్వీకరించింది.

అయితే, పిచ్చి కుదిరినవాడి కన్నొక్కటి, వదినగారి ఏకాక్షిలోకి దూసుకుపోయిన సత్యం ఎవరూ కనిపెట్టలేకపోయినారు. ఏకాక్షి రెపరెపలాడింది. పెళ్ళిపీటలమీదున్న కూతురు నవ్వుకుంది.

(ఏకాక్షిని ఏకాక్షమ్మ అందాం!)

"ఈ చచ్చినవాళ్ళంతా పెళ్ళి కెందుకు రావాలి?" అన్నమాటలు, పిచ్చి కుదిరినవాడి చెవిలో పడినాయి.

"పిచ్చివాడి పెళ్లికి చచ్చినవాళ్లంతా పెద్దలే!" అన్నాడు పెళ్ళికోసం పిచ్చిని ఉండచుట్టి తోకలో భద్రపరుచుకున్న కొడుకు.

చచ్చినవాళ్ళ పిచ్చివాడి పెళ్ళికివచ్చిన పెద్దలంతా, పిచ్చివాణ్ణి ఎగాదిగా చూశారు.

పిచ్చి కుదిరినవాడి చేతులు మంగళసూత్రాలు పట్టుకున్నాయి.

"ఈ పీట ముడివేయవలసినవాణ్ణి నేను!" అని, పిచ్చి కుదిరినవాడు అరుస్తున్నప్పటికీ, వినపడ్డట్టున్న ఏకాక్షమ్మ-ఎందుకేనా మంచిదని-ముళ్లు వొదులుగా వేసింది.

బాజా భజంత్రీలు. నవరంధ్రాలూ తూట్లు పెట్టాయి.

పిచ్చివాడి పెళ్ళయిపోయిందన్నారందరూ.

"ఎవరెవరు ఏయేకట్నాలు చదివించార్రా?" అన్నారు కొందరు షష్టిపూర్తులు.

"ఇచ్చారు-పెద్దపెద్ద చిప్పలు" అన్నది ఏకాక్షమ్మ చిప్పని అభినయిస్తూ.

"చిప్పా? రాచ్చిప్పా? రాగిచిప్పా? రాచిప్పవుతే పచ్చడికి పనికొస్తుంది. రాగిచిప్పవుతే జోలికి. అంతకన్నా ఏంకావాలి? నాకు రాగిచిప్పేకావాలి. ఇలా ఇచ్చెయ్యి" అన్నాడు పిచ్చి కుదిరినవాడు.

పెళ్ళిచేసుకున్న కొడుక్కి, పిచ్చి కుదిరిందా లేదా, అన్న సందేహం కలిగింది నలుగురికీ.

"వీడికి పెళ్ళంటే అయిందిగాని, పిచ్చి పిచ్చిలాగే ఉంది" అన్నారొకరు.

తోకలో ఉండల్లే మఠంవేసిన పిచ్చి, ఆవు గొంతులోంచి నోట్లోకి వుండొకటి నెమరుకొచ్చేట్టు—తలలోకొచ్చింది.

పెళ్ళికుదిరితే పిచ్చికుదురుతుందని అనుకోవడం మూర్ఖం అన్నారింకొకరు.

"నా పిచ్చి కుదిరిందీ లేనిదీ నువ్వు చూసొచ్చావా?" అని ఎగిరిపడ్డాడు పిచ్చి కుదిరినవాడు.

"బాబోయ్!పిచ్చివాడు" అన్నారుమరొకరు.

"పిచ్చీలేదు-యేంలేదు. మీకే పిచ్చి-చచ్చినవాళ్ళు" అంటూ ఏకాక్షమ్మ పిచ్చివాడన్నవాడి రెక్కపట్టుకొని లాక్కుపోయింది.

"మధ్య నువ్వెవతె? నీ మెళ్లో నేనేం కట్టలేదు" అన్న పిచ్చివాడికేక విని, మెళ్లో కట్టించుకున్న కూతురు దిగాలుపడి చూసింది.

"పిచ్చివాడికి పెళ్ళయితే కుదరొచ్చుగాని, పిచ్చి కుదురుతుందని ఎక్కడుందీ?" అన్నది సన్నాయి మంగళం.

★